# గాజువాకలో గెలిచి జగన్‌కు కానుకగా ఇద్దాం

- ఐదేళ్లలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి
- సుపరిపాలనకు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ
- ఎన్నికల తర్వాత కూటమి కనుమరుగు
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి
- గాజువాకలో పార్టీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్



వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించి గాజువాక విజయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా అందిద్దామని పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఐదేళ్లలో సుపరిపాలన అందించి రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలిపారన్నారు. గాజువాక నియోజకవర్గం చట్టివానిపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని వై.వి.సుబ్బారెడ్డి శనివారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా మంత్రి అమర్‌నాథ్ హిమ గౌరి దంపతులు, గురునాథరావు సతీమణి గుడివాడ నాగమణి ప్రత్యేక అర్చనలు, గో పూజ చేశారు.

**దీర్ఘకాల సమస్యల పరిష్కారం**

చంద్రబాబు 14 ఏళ్లలో చేయని అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేసి చూపించారని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అవినీతి రహిత పాలనను అందించి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల నిర్మాణాలతో విద్య, వైద్యాన్ని పేదలకు చేరువ చేశారన్నారు. సంక్షేమ పథకాలను అందించి పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరిచారని చెప్పారు. ఫిషింగ్ హార్బర్లు, నూతన పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. గాజువాకలో దశాబ్దాలుగా తీరని హౌస్ కమిటీ సమస్యను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారన్నారు. గత ప్రభుత్వాలు గాజువాకను నిర్లక్ష్యం చేశాయని, ఎమ్మెల్యే నాగిరెడ్డి హయాంలో గాజువాక అభివృద్ధి పథంలో నిలిచిందన్నారు. అమర్‌నాథ్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారన్నారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు దళితులంటే చులకన**

సాధారణ కుటుంబం నుంచి వచ్చిన దళితులను, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులను అసెంబ్లీకి పంపిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సింగనమలలో ఉన్నత విద్యను అభ్యసించిన దళితుడైన ట్రక్ డ్రైవర్ వీరాంజనేయులుకు అసెంబ్లీ సీటు కేటాయించడంతో జగన్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. కోట్లకు సీట్లను అమ్ముకుని పెత్తందార్లను ప్రోత్సహించే చంద్రబాబు దళితులను చులకన చేసి మాట్లాడిన మాటలను రాష్ట్రంలో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన, కూటమి పార్టీలు కనుమరుగవుతాయన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, మాజీ చైర్మన్ రాజా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, ఇంటక్ నాయకుడు మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్లు గుడివాడ అనూష, ఉరుకూటి చందు, తిప్పల వంశీరెడ్డి, ఇమ్రాన్, బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, గుడివాడ లతీష్, నాయకులు దామా సుబ్బారావు, పల్లా చినతల్లి, డేవిడ్ రాజు, బోగాది సన్యాసిరావు, ఈటి శ్యామలరావు, ఈగలపాటి యువశ్రీ, జి.వి.కృష్ణారావు, మానిటరింగ్ కమిటీ మెంబర్ కటికల కల్పన, సిరట్ల వాసు, మస్తానప్ప, వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, రెడ్డిపల్లి చిట్టిబాబు, ఈటి సురేష్, రొక్కం వెంకట్రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, సిరసపల్లి శ్రీనివాస్, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ అదనపు పరిశీలకుడిగా దేవన్‌రెడ్డి



తిప్పల దేవన్‌రెడ్డి



భూపతిరాజు శ్రీనివాసరాజు

గాజువాక : ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తిప్పల శ్రీనివాస్ దేవన్‌రెడ్డిని గాజువాక నియోజకవర్గం అదనపు పరిశీలకుడిగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. నూతన పదవిలో నియమితులైన దేవన్‌రెడ్డిని పార్టీ గాజువాక నియోజకవర్గ నాయకులు అభినందించారు.

**రాష్ట్ర కార్యదర్శిగా భూపతిరాజు**

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 73వ వార్డుకు చెందిన భూపతిరాజు శ్రీనివాసరాజును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కమిటీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన్ను స్థానిక నాయకులు అభినందించారు.

## ‘వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించండి’



నక్క వెంకటరమణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అమర్‌నాథ్

పెదగంట్యాడ: వైఎస్సార్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క వెంకటరమణను గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ శనివారం సాయంత్రం కలిశారు. ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని కోరారు. తమ కుటుంబంతో మూడు తరాలుగా ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గత ఎన్నికల్లో నాగిరెడ్డి విజయం కోసం కృషి చేసినట్లే ఈ సారి తన విజయానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు గొందేశి సత్యారావు, దల్లి పైడికొండ, సంపంగి ఈశ్వరరావు, తోకాడ అప్పారావు, పిట్టా రెడ్డి, వెంకటేష్, కాకినాడ పెంటారావు, రెడ్డి జగన్నాథం, మాడిశ రాము, నమ్మి నూకరాజు, కురందాస్ వంశీకృష్ణ యాదవ్, వియ్యపు చంద్రరావు, మొల్లి ఈశ్వరరావు, నక్క అప్పారావు పాల్గొన్నారు.

## అమర్‌నాథ్ పర్యటనను విజయవంతం చేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలో వచ్చే నెల 1న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ పర్యటనను విజయవంతం చేయాలని ఆ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కోరారు. టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో శనివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు అమర్‌నాథ్ 74వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని తెలిపారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**నేడు కార్యకర్తల సమావేశం :** బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో అమర్‌నాథ్ సమావేశం కానున్నట్లు వంశీరెడ్డి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## క్లుప్తంగా

### రూ.3.50 కోట్ల ఆస్తి పన్ను వసూలు



జెడ్సీ సన్యాసినాయుడుకు ఆస్తిపన్ను చెక్కులను అందజేస్తున్న జీవీఎంసీ రెవెన్యూ అధికారులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ అధికారులు శనివారం మూడున్నర కోట్ల రూపాయల ఆస్తిపన్ను వసూలు చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నుల వసూలుపై కమిషనర్ నుంచి వెలువడిన ఆదేశాల మేరకు జోనల్ రెవెన్యూ సిబ్బంది ఇక్కడి వాణిజ్య, వ్యాపార సంస్థలు, షాపింగ్ మాళ్లతో పాటు నివాస గృహ యజమానుల నుంచి ఈ పన్నును వసూలు చేశారు. పన్నుకు సంబంధించిన చెక్కులను రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రెడ్డి మోహన్, సుభాన్, శివ తదితరులు జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని జెడ్సీ అభినందించారు.

### కనులపండువగా శివపార్వతుల కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు శనివారం అష్టోత్తర కలశారాధన చేశారు. ఆలయ 17వ వార్షికోత్సవాల్లో భాగంగా రుత్వికుల ఆధ్వర్యంలో అమ్మవార్ల మూలమంత్ర విశేష హోమం, నవగ్రహ, నక్షత్ర హోమాలు చేశారు. అనంతరం శివపార్వతుల దివ్య కల్యాణం నిర్వహించారు.

### హనుమత్ వాహనంపై నృసింహుడు



అప్పన్న తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా శనివారం సాయంత్రం స్వామికి హనుమత్ వాహనంపై తిరువీధి నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను అలంకరించి హనుమత్ వాహనంపై అధిష్ఠింపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు.

**ఎన్నో ఏళ్ల తర్వాత...**

ఎన్నో ఏళ్ల తర్వాత శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి హనుమత్ వాహనంపై కనువిందు చేశారు. అప్పట్లో హనుమత్ వాహనంపై స్వామికి తిరువీధి జరిగేదని వైదికులు చెప్పడమే తప్ప అలాంటి సందర్భం ఇప్పటి వరకూ లేదు. స్వామికి జరిగే నిత్య, వార్షిక , ప్రత్యేక ఉత్సవాల్లో కూడా హనుమత్ వాహనంపై తిరువీధి నిర్వహించలేదు. నృసింహ సుదర్శన మహా యజ్ఞం సందర్భంగా మళ్లీ హనుమత్ వాహనంపై స్వామిని తిలకించే భాగ్యం భక్తులకు దక్కింది.

### విశేష అలంకరణలో తిరుమలేశుడు



అక్కిరెడ్డిపాలెం: శ్రీనివాసుడు విశేష పుష్పాల అలంకరణలో నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామికి శనివారం రాత్రి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ‘ఉక్కు’ ప్రైవేటీకరణతో నిర్వాసితులకు నష్టం




దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం జరుగుతుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. వారితో పాటు ప్లాంట్ కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1143వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షల్లో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు పరిశ్రమను కేంద్రప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. కార్మికులు పట్టు వదలకుండా ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

మర్రిపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 పరిధిలోని ఆర్‌ఏపీ కలెక్షన్ సెంటర్లలో ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఈఈ బి.కె. నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోన్–2 పరిధిలోని గాజువాక కలెక్షన్ సెంటర్ ఈఈ ర్‌వో కార్యాలయం, కంచరపాలెం, మాధవధార వుడా కాలనీలోని ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ కార్యాలయంలో వినియోగదారులు ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని చెప్పారు.

**పెదగంట్యాడలో..**

పెదగంట్యాడ: ఈ నెల 31న ఆదివారం విద్యుత్ బిల్లుల కేంద్రాలు పని చేస్తాయని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగంట్యాడ జంక్షన్‌లోని సబ్‌స్టేషన్ వద్ద గల విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రంలో బిల్లులు చెల్లించవచ్చన్నారు.

## సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

నాలుగో రోజు వైభవంగా నృసింహ మహా యజ్ఞం



యజ్ఞశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న రుత్వికులు



యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: సింహగిరిపై ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడుతోంది. లోక కల్యాణార్థం చేపట్టిన సుదర్శన నారసింహ మహాయజ్ఞం నాలుగోరోజు శనివారం శాస్త్రోక్తంగా సాగింది. యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలతో పాటు స్వామి దర్శనానికి వచ్చిన భక్తజనంతో సింహగిరి కిటకిటలాడింది. యజ్ఞ ప్రాంగణం వేద ఘోషతో మార్మోగింది. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను ఒక పల్లకిలో, చక్రపెరుమాళ్‌ను వేరే పల్లకీలో అధిష్టంపజేసి ఆలయ ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న యజ్ఞశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చి అధిష్టంపజేశారు. ఉభయదాతలకు కంకణ ధారణ చేసిన అనంతరం వేద మంత్రోచ్ఛరణలతో యజ్ఞశాలలో ఐదు హోమకుండాల వద్ద యజ్ఞం నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో పూర్ణాహుతి అనంతరం ప్రసాదాన్ని యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలకు, భక్తులకు అందజేశారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తుల చెంత రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్ర నామం, దివ్యప్రబంధం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకాలను వైదికులు పఠించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున కుటుంబసమేతంగా, దేవదాయ శాఖ ఏడీసీ కె.రామచంద్రమోహన్ సతీసమేతంగా యజ్ఞంలో పాల్గొన్నారు.

# జనమే జగన్ బలం

- లబ్ధిదారులంతా ఆయన వెంటే..
- రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్
- 85వ వార్డు అగనంపూడి కాలనీల్లో ప్రచారం



గుడివాడ గురునాథరావుతో తనకున్న అనుబంధాన్ని అమర్‌తో పంచుకుంటున్న అప్పారావు



అవ్వతో ముచ్చటిస్తున్న అమర్‌నాథ్



తలారివానిపాలెంలో స్వాగతం పలుకుతున్న స్థానిక యువత

అగనంపూడి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బలం జనమే అని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులంతా ఆయన వెన్నంటే ఉన్నారన్నారు. 85వ వార్డు అగనంపూడి సెక్టార్–3 నిర్వాసిత కాలనీలు దిబ్బపాలెం, దానబోయినపాలెం, తలారివానిపాలెంల్లో శనివారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు, యువత ఎదురేగి స్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన ఆయన ఓటర్లను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. వృద్ధులు, మహిళలను కలిసి కుశల ప్రశ్నలు వేస్తూ పలకరించారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు.

**గురునాథరావు బిడ్డకే మా ఓటు**

రోడ్డు పక్కన కుమ్మరి పనులు చేసుకుంటున్న ఉరుము అప్పారావు అనే వ్యక్తి అమర్‌నాథ్‌ను పలకరించారు. నువ్వు మా గురునాథరావు బిడ్డవయ్యా.. నీకే ఓటేస్తామని చెప్పారు. గురునాథరావుతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, ఉరుకూటి చందు, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి నాగేశ్వరరావు, పెదిరెడ్ల హరీష్, బోర సోమునాయుడు, జెర్రిపోతుల సమర, యలమంచిలి అప్పారావు, సాలాపు అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షల స్వాధీనం

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్ గేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద శనివారం నాగరాజు అనే వ్యక్తి నుంచి రూ.3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్యామలరావు, సిబ్బందితో కలిసి శనివారం ఇక్కడ తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ నగదు పట్టుబడింది. నగదును సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించినట్లు సీఐ పిన్నంటి రమణ తెలిపారు. పట్టుబడిన వ్యక్తి కుటుంబ సభ్యులతో కలసి కారులో విజయనగరం నుంచి అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయానికి వెళ్తున్నారు. అక్కడ అవసరాలకు ఈ నగదు తీసుకెళ్తున్నట్లు చెప్పినప్పటికీ.. సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ వెల్లడించారు.






## ఘనంగా ఇఫ్తార్ విందు



ప్రార్థన చేస్తున్న ముస్లిం మహిళలు



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

గాజువాక : రంజాన్ సందర్భంగా కణితి రోడ్‌లోని మదీనా మసీదు, మదీనా యూత్ ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సౌత్ ఏసీపీ త్రినాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లింలు ప్రార్థనలు చేసి, ఇఫ్తార్‌ను స్వీకరించారు.

## పింఛన్ల పంపిణీ నిర్ణయంపై పునః పరిశీలించాలి

- న్యాయవాది కాళిదాసు రెడ్డి

విశాఖ లీగల్: వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు నాయుడు, మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ ఫిర్యాదుపై పలువురు న్యాయవాదులు విస్మయం చెందారు. పేద, బడుగు బలహీన వర్గాలు,వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి నెలనెలా ఒకటో తేదీన పెన్షన్లు వలంటీర్లు పింఛన్లు అందిస్తూ వారికి ఆసరాగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయొద్దని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి సీనియర్ న్యాయవాది వి. కాళిదాసు రెడ్డి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ అతి ప్రాచీనమైనదని పేర్కొన్నారు. 1977లో అప్పటి జనతా ప్రభుత్వం దేశవ్యాప్తంగా వలంటీర్ల ద్వారా ఆరోగ్య, సామాజిక సేవలు అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సామాజిక కార్యకర్త పేరుతో గ్రామాల్లో ప్రభుత్వ, వైద్య సేవలు, అందించడానికి ఈ వలంటీర్ వ్యవస్థ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ సేవలను మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునర్ వ్యవస్థీకరించి ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకున్నారని చెప్పారు. లక్షలాదిమంది వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడే అవకాశం ఉన్న దృష్ట్యా ఎన్నికల కమిషన్ తమ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కాళిదాసు రెడ్డి కోరారు.






## ‘దళిత ద్రోహి చంద్రబాబు’

అక్కిరెడ్డిపాలెం: చంద్రబాబు దళిత ద్రోహి అని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శింగనమలలో దళితుడైన రెడ్డి వీరాంజనేయులు అనే ట్రక్ డ్రైవర్‌కు అసెంబ్లీ సీటు ఇవ్వడంపై చంద్రబాబు వ్యంగ్యంగా మాట్లాడటం ఆయన అహంకారానికి పరాకాష్ట అన్నారు. చట్టివానిపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి దళితుల పక్షపాతి అని, దళితులను అక్కున చేర్చుకునే ఉన్నత వ్యక్తిత్వం గల మహానాయకుడు అన్నారు. చంద్రబాబు ఎప్పుడైనా దళితులను పక్కన కూర్చోబెట్టుకున్నారా అని ప్రశ్నించారు. దళితులకు చట్టసభల్లో ఉన్నత అవకాశాలు కల్పించిన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబును ఓడించి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

## యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతున్న ఓ యువకుడిని లైఫ్‌గార్డ్స్ కాపాడారు. వివరాలిలా.. హైదరాబాద్‌కు చెందిన 11 మంది యువకులు శనివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులందరూ అక్కడ ఎంజాయ్ చేసి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో ఖయ్యూమ్ అనే యువకుడు కొట్టుకుని పోతుండగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, చిన్నప్పన్న ఎం.అమ్మోరు, చందు, సతీష్, డి.కార్తీక్, రాజు గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. తమలో ఒకరికి ప్రాణాపాయం తప్పడంతో స్నేహితులందరూ ఊపిరి పీల్చుకున్నారు. వీరికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

